క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన తపస్ నాయకులు



ఎమ్మెల్సీ కొమురయ్యతో తపస్ నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముల్క కొమురయ్యను తపస్ నాయకులు జిల్లాకు చెందిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ కలిశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలే ధ్యేయంగా పనిచేస్తానని, జిల్లాలో సమస్యలు పరిష్కరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

జిల్లా ప్రజలకు నిరంతర విద్యుత్

జగిత్యాలజోన్: జిల్లా ప్రజలకు నిరంతర విద్యుత్ అందిస్తామని ఎస్ఈ సాలియా నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని టౌన్–2 సెక్షన్ పరిధి విద్యానగర్‌లోని రామాలయం ఎదురుగా డీపీఆర్–21కు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ 100 కేవీ నుంచి 160 కేవీగా అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. వేసవి కాలం కావడంతో లోడ్ అధిగమించేందుకే ట్రాన్స్‌ఫార్మర్‌లు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. డీఈలు గంగారెడ్డి, రవీందర్, ఏడీఈ జవహర్ లాల్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం అప్పగింత



ఏఈకి భూమిపత్రాలు ఇస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం 30 గుంటలు సోమవారం అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం ప్రభుత్వం రూ.2.20 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. స్థలం విషయంలో ఇన్నాళ్లు సర్వేలు చేసి 30 గుంటలు గుర్తించారు. గ్రామస్తుల సమక్షంలో ట్రాన్స్‌కో అధికారులకు రెవెన్యూ అధికారులు భూమి పత్రాలను అప్పగించారు. విండో చైర్మన్ కందరి జీవన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నవీన్, ఆర్ఐ నాగేశ్, డైరెక్టర్ కందరి కిషన్‌రెడ్డి, అధికారులు మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి



మెట్‌పల్లి: మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కంతి మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి మోహన్‌రెడ్డితో పాటు పుప్పాల లింబాద్రి, భానుమూర్తి పోటీ పడ్డారు. ఇందులో మోహన్‌రెడ్డి అత్యధిక ఓట్లు సాధించినట్లు ఎన్నికల అధికారులు మగ్గిడి వెంకటనర్సయ్య, సోమ భూమేశ్వర్, వడ్డెపల్లి శ్రీనివాస్, కోటగిరి వెంకటస్వామి తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ కృష్ణమూర్తి

జగిత్యాల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాంటి నార్కోటిక్స్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహిళ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమాయకంగా ఉండి, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న యువకులను డ్రగ్స్ ముఠా మాయ చేసి వారికి అలవాటు చేస్తారని, అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మకూడదన్నారు. ఎస్సై రమేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు సంగీత రాణి, సుజాత పాల్గొన్నారు.

సనాతన ధర్మం వైపు పయనించాలి



మాట్లాడున్న డాక్టర్ శిల్పాకళ దీదీ

గొల్లపల్లి: నేటితరం సనాతన ధర్మం వైపు పయనించాలని డాక్టర్ శిల్పా కళ దీదీ అన్నారు. సోమవారం మండలంలోని భీంరాజ్‌పల్లిలో బీబీకే ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సనాతన ధర్మం, హిందూ ధర్మం, శ్రీరాముని ధర్మ ప్రవచనాలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా గ్రామంలో శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరాముని ఆదర్శవంతమైన జీవితం గొప్ప విలువలకు నిదర్శనం అన్నారు. రిటైర్డ్ జేసీ కందుకూరి కృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాట.. పనులకు టాటా

- సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఏళ్ల తరబడి కనీస మరమ్మతుకు నోచుకోని రోడ్లు
- బిల్లులు రావన్న నెపంతో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు?
- వానాకాలం లోపు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



సారంగాపూర్–బట్టపల్లి గ్రామాల మధ్య తారుపోయి కంకర తేలిన రోడ్డు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పలు రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోగా, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా బాగుపడతాయనుకున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. చాలా రోడ్లకు నిధులు మంజూరైనా.. బిల్లులు రావనే నెపంతో కాంట్రాక్టర్లు పనులు కొనసాగించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రోడ్లు పరిస్థితి దయనీయంగా మారింది. మరో రెండు నెలలైతే వర్షాకాలం వస్తుందని, ఆ లోపు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల పరిస్థితి ఇలా..

- బీర్‌పూర్ మండలం కొల్వాయి–చిన్న కొల్వాయి గ్రామాల మధ్య 13 ఏళ్ల క్రితం నిర్మించిన తారు రోడ్డు పూర్తిగా శిథిలమై గుంతలు ఏర్పడ్డాయి.
- బీర్‌పూర్ ఘాట్ రోడ్డుపై రాత్రింబవళ్లు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఘాట్‌పై పలు చోట్ల సైడ్‌బర్మ్‌లు కోతకు గురికాగా, గతంలో వేసిన సిమెంట్ రోడ్డు దెబ్బతింది. మరమ్మతు చేపట్టడంలేదు.
- కండ్లపల్లి–తుంగూర్ మధ్య ఆరేళ్ల క్రితం వరదలకు కొట్టుకుపోయిన రోడ్డుకు పూర్తిస్థాయి మరమ్మతులు జరగలేదు.
- రేచపల్లి–రాయికల్ మండలం తాట్లవాయి మధ్య చేపట్టిన రోడ్డు పనులు అర్ధంతరంగా కిలోమీటరు మేర ఆగిపోయి ఏళ్లు అవుతుంది.
- పోతారం–రేచపల్లి మధ్య మూడేళ్ల క్రితం 4 కిలోమీటర్లు రెన్యూవల్ బీటీ పనులు ప్రారంభించి, కంకర వేసి వదిలిపెట్టారు.
- బట్టపల్లి–సారంగాపూర్ దారిలో భీమన్నగుట్ట, బొల్లమ్మ బోరు వద్ద నుంచి తారురోడ్డుకు రూ.1.50 కోట్లు మంజూరై రెండేళ్లు దాటినా పనుల అతీగతి లేదు. సారంగాపూర్ నుంచి భీమన్న ఆలయం వరకు 500 మీటర్ల రోడ్డుకు టెండర్లు జరిగినా కాంట్రాక్టర్ విముఖతతో పనులు ప్రారంభం కాలేదు.
- జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్, జన్నారం (మంచిర్యాల జిల్లా) ప్రధాన రోడ్డును ఆనుకుని లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో ఊరకుంట ఉంది. ఇది ఎప్పుడు నీటితో నిండి ఉంటుంది. ఇక్కడ రోజురోజుకు ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కుంటకు సెఫ్టీవాల్ నిర్మాణం కోసం పలుమార్లు టెండర్లు జరిగినా పనులు ప్రారంభం లేదు.
- జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారిలో కోనాపూర్ వాగుపై రెండేళ్ల క్రితం రూ.5.25 కోట్లతో చేపట్టిన హైలెవల్ వంతెన పూర్తయినా, ఇరువైపులా అప్రోచ్ పనులు చేయాల్సి ఉంది.



కోనాపూర్ హైలెవల్ వంతెన వద్ద అసంపూర్తిగా రోడ్డు పనులు

వర్షాకాలం లోపు పూర్తి చేయాలి



ప్రతీ వర్షాకాలం కోనాపూర్ వాగుతో ఇబ్బందులు పడుతున్నాం. రెండు నెలల్లో హైలెవల్ వంతెన పూర్తి చేయాలి. వానాకాలం వస్తే వందలాది మంది వాహనదారులు మళ్లీ తిప్పలుపడతారు. వెంటనే అధికారులు పనులు చేపట్టాలి.

– బాస మల్లన్న, రేచపల్లి

ఘాట్‌పై రోడ్డు విస్తరించాలి



బీర్‌పూర్ ఘాట్‌పై ఎదురుగా వాహనాలు వస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గుట్టపై సిమెంట్ పోయి గుంతలు ఏర్పడ్డాయి. సైడ్ బర్మ్‌లు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ఘాట్‌పై రోడ్డు విస్తరించాలి.

– బదినెపల్లి శంకర్, బీర్‌పూర్

పనులు చేసేందుకు చర్యలు

కొన్ని పనులు కాంట్రాక్టర్లు అగ్రిమెంటు చేసుకుని ప్రారంభించడం లేదు. వారితో చర్చిస్తున్నాం. ఉన్నతాధికారులు కూడా పనులు ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. చాలా రోడ్లు వచ్చే రెండునెలల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ఆర్‌అండ్‌బీ ఏఈ



రాయికల్: రాయికల్ పట్టణంలోని ఒకటో వార్డులో పారిపల్లి మహేశ్ ఆస్పత్రి వద్ద నూతనంగా నిర్మించిన మురికి కాలువ చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోయింది. కాలువలో నుంచి మురికి నీరు వెళ్లకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, రాయికల్ : 89197 77985

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆదర్శ్



ఆదర్శ్

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన బత్తిని ఆదర్శ్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 8 నుంచి 12 వరకు ఒడిశాలో జరిగే సబ్ జూనియర్ జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈసందర్భంగా ఆదర్శ్‌ను పాఠశాల పీడీ భూమేశ్, ఎంఈవో రాంచంద్రం, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, సాన యాదిరెడ్డి, మాజీ సైనికుడు వెంకటరమణారెడ్డి, సీనియర్ క్రీడాకారులు బాస మహేశ్, జైనపురం సాయికిరణ్, ప్రజాప్రతినిధులు తదితరులు అభినందించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి ప్రోత్సాహం

ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణికి ఆర్థిక ప్రోత్సాహం అందించి తమ ఉదారత చాటుకున్నారు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్. ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన శరణ్య జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక కాగా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్థిక ప్రోత్సాహం అందించారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ

పెగడపల్లి: మండలంలోని నామాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జోనల్‌స్థాయి ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అన్నాడి చైత్రరెడ్డి, చెకబండి సుస్మిత, హంసిత, అరుణ్ బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం మాదాడి సులోచన, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రం



ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ నుంచి ఆత్మనగర్ వరకు సోమవారం నాయకులు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని, రాజ్యంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. రాష్ట్ర నాయకుడు కృష్ణారావు, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

కథలాపూర్: అన్ని వర్గాల సంక్షేమం కోసం రూపొందించిన రాజ్యాంగాన్ని రక్షించుకుందామని పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య పేర్కొన్నారు. సోమవారం కథలాపూర్ మండలం పోతారం, ఇప్పపెల్లి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు నరేశ్‌చారి, సిరికొండ రాములు, కారపు గంగాధర్, మట్టగజపు గంగరాజం, జక్కుల రాజం, ఎండీ రేహన్, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు

వెల్గటూర్ : మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్, నాయకులు రాజేందర్, జీవన్‌రావు, వెంకటగిరి, తిరుపతి, సతీశ్, రమేశ్, మొగిళి, ఈశ్వర్, భూమయ్య, చక్రపాణి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలకు వ్యాక్సిన్

రాయికల్: మండలంలోని చింతలూరు గ్రామంలో సోమవారం సుమారు 100 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు మండల పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. కుక్క కాటుతో పాడి పశువులు, గొర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాక్సిన్ ఎంతో దోహదపడుతుందన్నారు.

వైభవంగా పట్టాభిషేకం

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్, నామాపూర్ శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాల్లో సోమవారం శ్రీరాముడి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కలశాలు, ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముడి అష్టోత్తర శతనామార్చన చేశారు. నామాపూర్‌లో 108 హోమ గుండాలతో యజ్ఞం నిర్వహించి రోటీగూడెం మౌన స్వామిచే గీతోపదేశం చేశారు. మాజీ జెడ్పీటీసీ రాజేందర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి విన్నవించారు. రేచపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం కింద రేచపల్లి, భీంరెడ్డిగూడెం, లచ్చనాయక్‌తండా, మ్యాడారంతండా గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలని కోరగా, డీఎంహెచ్‌వోతో మాజీ ఎమ్మెల్సీ మాట్లాడారు.

చైతన్యంతోనే హక్కులు

కథలాపూర్: యాదవులు చైతన్యమైతేనే హక్కులు సాధించుకోవచ్చని సంఘం జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షుడు గానవేని మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలో మాట్లాడారు. రాష్ట్రంలో కులాల వారీగా చూస్తే యాదవుల జనాభా అధికంగా ఉందని, రాజకీయపార్టీలు అధిక సీట్లు కేటాయించాలన్నారు.

సర్వే నుంచి మినహాయించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామ పంచాయితీ కార్యదర్శులు తమను ఇందిరమ్మ ఇండ్ల సర్వే నుంచి మినహాయించాలని ఎంపీవో రామకృష్ణ రాజుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

రాములవారి బ్రహ్మోత్సవాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీరామాలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగాయి. రెండోరోజు ద్వారాతోరణ పూజ, నిత్య హవనం, సుందరకాండ హవన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సారంగాపూర్ మండలంలోని లచ్చక్కపేటలో శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణం, పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సిద్ధం మహేశ్, వకులాభరణం మురళి, తుమ్మనపల్లి రంజిత్, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో చలో గాం

పెగడపల్లి: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గాం చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని నంచర్ల గ్రామంలో బీజేపీ నాయకులు సోమవారం పర్యటించారు. స్థానిక రేషన్ దుకాణాన్ని సందర్శించి సన్న బియ్యం పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లా అధికార ప్రతినిధి మద్దిపల్లి సత్యం, మండల అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, తిరుపతి, మల్లేశం, హరీశ్, అంజి, సాగర్, సురేశ్, సతీశ్, రమేశ్, బీరయ్య, శివ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన తాడుక హన్మంతు బైక్‌పై వెళ్తుండగా.. స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఢీకొట్టాడు. హన్మంతు తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

మల్యాల: మండలంలోని నూకపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో ఎండీ అఖిల్ వద్ద షేక్ సుమర్ డబ్బు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వమని అడగ్గా, షేక్ సుమర్ మరో ఇద్దరితోపాటు అఖిల్‌ను చంపుతానని బెదిరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సారంగాపూర్: సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీవోలు గంగాధర్, లచ్చాలు, ఎంపీవో సలీంకు వినతిపత్రాలు అందజేశారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేత

మల్యాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో స్వాతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కోరెపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ విజయయాత్ర



శోభాయాత్రలో భక్తులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం విశ్వ హిందు పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరహనుమాన్ విజయయాత్రను శోభాయమానంగా నిర్వహించారు. పట్టణంలోని మంచినీళ్ల బావి వద్ద ప్రారంభమైన శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా వేడుకగా సాగింది. ఆధ్యాత్మిక గురువు కొత్తకోట శివానందస్వామి నేతృత్వంలో సాగిన శోభాయాత్రలో బీజేపీ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, ఆంకారి సుధాకర్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు అన్నదానం

జిల్లా కేంద్రంలోని శ్రీగుట్టరాజేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం హనుమాన్ దీక్షాపరులకు మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నదానం చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు కొత్త మోహన్, గాజుల రాజేందర్, రమేశ్‌రావు, బండ శంకర్, ముంజాల రఘువీర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల రూరల్‌మండలం మోరపల్లి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వేలును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా విషయం తెలుసుకున్న నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆందోళన చేపట్టారు. సీఐ కృష్ణారెడ్డి నాయకులతో మాట్లాడి అంబేడ్కర్ విగ్రహానికి మరమ్మతు చేయించడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. అంబేడ్కర్ ఉత్సవ కమిటీ కన్వీనర్ నక్క విజయ్‌కుమార్, దీపక్, బొల్లి శేఖర్, ఇజ్రాయిల్, కోకన్వీనర్ దోనిపాల శంకర్, బొల్లె గంగారాం, దుమాల గంగారాం పాల్గొన్నారు.



వృథా

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి, జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట శివారులోని బొల్లె వాగు వద్ద గేట్‌వాల్వ్ లీకేజీతో రెండురోజులుగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో నీరు వాగులోకి చేరుతోంది. దీంతో హన్మాజీపేట, బాలపల్లి, పొరండ్ల, కన్నాపూర్ గ్రామాలకు భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు.



కలుషితం

రాయికల్: రాయికల్ పట్టణంలోని ఒకటో వార్డులో డాక్టర్ పారిపల్లి మహేశ్ ఆస్పత్రి వద్ద పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితం అవుతోంది. మరమ్మతుల కోసం 20 రోజుల క్రితం తవ్వగా భగీరథ పైప్ లీక్ కావడంతో మురికినీరు పైపుల్లోకి చేరుతోందని పలుమార్లు కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని కోరుతున్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో కొందరు అక్రమంగా కట్టడాలు నిర్మించారని, వాటిని తొలగించి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని గ్రామస్తులు కోరారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్ ఆఫీస్ ఎదుట అన్ని కుల సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు.